ఆసీస్ అడ్డు తొలిగేనా?

నేడే కంగారూలతో భారత్ సెమీస్ పోరు

వరుస విజయాల జోష్‌లో రోహిత్ సేన ● బ్యాటింగ్‌లో బలంగా స్మిత్‌సేన

రెండేండ్ల క్రితం డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్‌లో టీమ్‌ఇండియాకు 'గద'ను దూరం చేసి.. ఏడాదిన్నర క్రితం వన్డే ప్రపంచకప్‌లో అజేయంగా ఫైనల్‌కు చేరిన టీమ్‌ఇండియా కప్పు కలను అడ్డుకున్న కంగారూలు మరోసారి రోహిత్ సేన 'చాంపియన్స్' ప్రయాణంలో ఎదురయ్యారు. 11 ఏండ్ల తర్వాత చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న టీమ్‌ఇండియా కల నెరవేరాలంటే ఆసీస్ అడ్డు తొలగించుకోవాల్సిందే..

మధ్యాహ్నం 2:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్ హాట్ స్టార్‌లో లైవ్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వేటలో ఉన్న భారత జట్టు మంగళవారం మరో కీలక సమరానికి సిద్ధమైంది. నేడు జరుగబోయే తొలి సెమీస్‌లో రోహిత్ సేన.. అగ్రశ్రేణి ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఐసీసీ టోర్నీలలో భారత్‌కు కొరకరాని కొయ్యగా మారిన ఆస్ట్రేలియా.. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌తో పాటు అదే ఏడాది వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లోనూ రోహిత్ సేనను ఓడించింది. ఆ పరాభవాలకు దుబాయ్‌లో బదులు తీర్చుకోవడంతో పాటు చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వేటలో ముందంజ వేయాలంటే మెన్ ఇన్ బ్లూ కంగారూల గండాన్ని దాటాల్సిందే. మ్యాచ్‌లో ఫేవరేట్‌గా భారత్ బరిలోకి దిగుతున్నా ఐసీసీ టోర్నీలలో మనపై ఆసీస్‌కు మెరుగైన రికార్డు ఉంది. స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయిస్తున్న దుబాయ్ పిచ్‌పై ఆసీస్ బ్యాటర్ల జోరుకు భారత స్పిన్ మాంత్రికుల మాయాజాలానికి రసవత్తర పోరు జరగడం ఖాయం!

ఫేవరేట్‌గా భారత్

దుబాయ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ గెలిచి హ్యాట్రిక్ విజయాల జోష్‌లో ఉన్న భారత్.. సెమీస్ పోరులోనూ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. గత మ్యాచ్‌లో నిరాశపరిచినా రోహిత్, కోహ్లీ, గిల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. మిడిలార్డర్‌లో శ్రేయాస్, అక్షర్, హార్దిక్, రాహుల్‌తో భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. అంతగా అనుభవం లేని ఆస్ట్రేలియా బౌలర్లను ఎదుర్కోవడం పెద్ద కష్టమేమీ కాకపోయినా స్పిన్నర్ జంపాను భారత బ్యాటర్లు ఏ మేరకు నిలువరిస్తారో చూడాలి. దుబాయ్ పిచ్ మ్యాచ్ మ్యాచ్‌కూ భిన్నంగా స్పందిస్తున్న వేళ.. తుది జట్టులో ఎవరిని ఆడిస్తారనేదీ ఆసక్తికరంగా మారింది. కివీస్‌తో మ్యాచ్‌లో ఇద్దరు పేసర్లు, నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా.. అదే ఫార్ములాతో ఆడే అవకాశాలుంటే రాణా బెంచ్‌కే పరిమితమవ్వొచ్చు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన వరుణ్ చక్రవర్తిని ఆసీస్‌తో ఆడిస్తారా? లేదా? అనేది సస్పెన్సే.

'హెడ్'ఏక్ తొలిగితేనే..

పలు కారణాలతో ఆసీస్ పేస్ త్రయం కమిన్స్, హెజిల్‌వుడ్, స్టార్క్ దూరమవడంతో ఆ జట్టు పేస్ విభాగం బలహీనంగా ఉంది. గత రెండు మ్యాచ్‌లలో ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్‌పై (273) ఆ జట్టు బౌలర్లు తేలిపోయారు. కానీ భారత్ బెంగ అంతా ఒక్కడి పైనే. భారత్‌పై మ్యాచ్.. అదీ ఐసీసీ టోర్నీలంటేనే చెలరేగే ఆడే ట్రావిస్ హెడ్‌ను త్వరగా ఔట్ చేస్తేనే మ్యాచ్‌పై టీమ్‌ఇండియా పట్టుబిగించే అవకాశముంటుంది. ఏ క్షణంలో అయినా మ్యాచ్‌ను మలుపు తిప్పే సామర్థ్యం అతడి సొంతం. బౌలింగ్ బలహీనంగా ఉన్నప్పటికీ హెడ్, ఇంగ్లిస్, స్మిత్, లబూషేన్, మ్యాక్స్‌వెల్, క్యారీ వంటి ప్రపంచ స్థాయి బ్యాటర్లతో ఆ జట్టు దుర్భేధ్యంగా ఉంది. మరి భారత స్పిన్నర్లు ఈ బ్యాటింగ్ లైనప్‌నకు ఎలా అడ్డుకట్ట వేస్తారనేది ఆసక్తికరం.

మూనీ మెరుపులు

యూపీపై గుజరాత్ ఘన విజయం

లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మూడో సీజన్ మ్యాచ్‌లు మరింత రంజుగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై గుజరాత్ జెయింట్స్ 81 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బేత్ మూనీ(59 బంతుల్లో 96 నాటౌట్, 17ఫోర్లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో గుజరాత్ 20 ఓవర్లలో 186/5 స్కోరు చేసింది. ఎక్లస్టోన్ (2/34) రెండు వికెట్లు తీసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన యూపీ 17.1 ఓవర్లలో 105 పరుగులకు కుప్పకూలింది. కాశ్వి గౌతమ్ (3/11), తనూజ కన్వర్ (3/17) మూడేసి వికెట్లు తీశారు.

ఈనెల 9 నుంచి ఖేలో ఇండియా వింటర్ గేమ్స్

శ్రీనగర్: తగినంత మంచు లేకపోవడంతో గత నెలలో వాయిదాపడ్డ ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ ఈనెల 9 నుంచి మొదలుకానున్నాయి. కశ్మీర్‌లోని గుల్మార్గ్ ఆతిథ్యమిచ్చే ఈ క్రీడలు మార్చి 9 నుంచి 12 వరకు జరుగనున్నాయి. గుల్మార్గ్‌లో గత కొన్ని రోజులుగా ఆశించిన మేర మంచు కురుస్తుండటంతో ఈ క్రీడలను నిర్వహించేందుకు జమ్ముకశ్మీర్ క్రీడా మండలి సిద్ధమైంది. స్కీయింగ్, స్నోబోర్డింగ్‌లో క్రీడాకారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఆధిక్యంలో ప్రజ్ఞానంద, అరవింద్

ప్రేగ్: భారత యువ గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానందతో పాటు అతడి సహచర ఆటగాడు అరవింద్ చిదంబరం ప్రేగ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో అగ్రస్థానానికి దూసుకొచ్చారు. ఐదు రౌండ్లు ముగిసే టప్పటికీ ఈ ఇద్దరూ 3.5 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఐదో రౌండ్‌లో ప్రజ్ఞానంద.. అరవింద్‌తో జరిగిన గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. మరో నాలుగు రౌండ్లు మిగిలున్న ఈ టోర్నీలో ఎవరు చాంపియన్‌గా నిలుస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

రోహిత్‌పై కాంగ్రెస్ లీడర్ బాడీ షేమింగ్

రాజకీయ దుమారం రేపిన శమా మహ్మద్ ట్వీట్ ● వంత పాడిన టీఎంసీ ఎంపీ

ముంబై: టీమ్‌ఇండియా సారథి రోహిత్‌శర్మపై కాంగ్రెస్ నాయకురాలు, ఆ పార్టీ అధికార ప్రతినిధి శమా మహ్మద్ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్ రాజకీయ దుమారం రేపింది. రోహిత్ లావుగా ఉన్నాడని, అతడు బరువు తగ్గాలని ఆమె చేసిన ట్వీట్‌పై రాజకీయ నాయకులు, మాజీ క్రికెటర్లు, నెటిజనులు భిన్నంగా స్పందిస్తున్నారు. శమా తన ట్వీట్‌లో 'రోహిత్ శర్మ క్రీడాకారుడిగా ఫిట్‌గా లేడు! అతడు బరువు తగ్గాలి. భారత క్రికెట్ జట్టులో గత సారథులతో పోల్చితే ఆకట్టుకోని కెప్టెన్ అతడే' అని రాసుకొచ్చింది. ఈ ట్వీట్ నెట్టింట కాసేపట్లోనే వైరల్ అయింది. శమా ట్వీట్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ స్పందిస్తూ 'గత కొన్నాళ్లుగా రోహిత్ ప్రదర్శన నాసిరకంగా ఉంది. ఇటీవల కాలంలో అతడు ఒక సెంచరీ తప్పితే మిగతా మ్యాచ్‌లలో రెండు, మూడు, నాలుగు పరుగులే చేసి ఔట్ అవుతున్నాడు. అతడు జట్టులో ఉండకూడదు. ఇతర ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేయడంతో భారత జట్టు గెలుస్తుంది తప్ప కెప్టెన్ పాత్ర ఏమీలేదు. శమా చెప్పింది అక్షరాలా నిజం'అని వ్యాఖ్యానించడం గమనార్హం. శమా వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ బండారి మాట్లాడుతూ.. 'ఈ వ్యాఖ్యలు సిగ్గుచేటు! భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌నూ వాళ్లు వదట్లేదు. రాజకీయాల్లో విఫలమైన వారి నాయకుడు రాహుల్ గాంధీని వాళ్లు క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారేమో' అని కౌంటర్ ఇచ్చాడు. శమా ట్వీట్ రాజకీయంగా దుమారం రేపడంతో కాంగ్రెస్ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఎప్పటిలాగానే అది ఆమె వ్యక్తిగత అభిప్రాయమని, వాటికి పార్టీతో సంబంధం లేదని తెలిపింది.

కేకేఆర్ సారథిగా రహానే

● వైస్ కెప్టెన్‌గా వెంకటేశ్ అయ్యర్

కోల్‌కతా: మరో మూడు వారాల్లో మొదలు కాబోయే ఐపీఎల్-18వ సీజన్‌కు గాను డిఫెండింగ్ చాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తమ సారథిగా భారత సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానేను నియమించింది. రహానేకు సారథ్య పగ్గాలను అప్పగించిన కేకేఆర్ యాజమాన్యం.. యువ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలను కట్టబెట్టింది. ఈ మేరకు ఆ జట్టు సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. పదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత గత సీజన్‌లో తమకు మూడో ఐపీఎల్ ట్రోఫీని అందించిన శ్రేయస్ అయ్యర్‌ను రిటైన్ చేసుకోకపోవడంతో పాటు వేలంలోనూ వదిలేసిన కేకేఆర్.. అనూహ్యంగా వెంకటేశ్‌ను రూ. 23.75 కోట్ల రికార్డు ధరతో దక్కించుకుంది. రహానేను కేకేఆర్ కొనుగోలు చేసినప్పుడే అతడితో పాటు వెంకటేశ్‌లో ఎవరికో ఒకరికి సారథ్య పగ్గాలు అప్పజెప్పుతారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. రహానేకు గతంలో ఐపీఎల్‌లో రైజింగ్ పూణె సూపర్‌జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌కు పలు మ్యాచ్‌లలో సారథిగా వ్యవహరించిన అనుభవం ఉంది.

ఆ జీన్ ప్యాంట్‌కు 31 లక్షలు

ఓస్లో: నార్వే చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ నిరుడు వరల్డ్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో ధరించిన వివాదాస్పద జీన్ ప్యాంట్ ఆన్‌లైన్‌లో భారీ ధర పలికింది. ఫిడే నిబంధనల ప్రకారం ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులు ఫార్మల్స్‌లో రావాల్సి ఉండగా కార్ల్‌సన్ మాత్రం జీన్స్‌లో వచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. దీంతో అతడు ఫిడే ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది. కాగా కొద్దిరోజుల క్రితం కార్ల్‌సన్.. ఈ జీన్స్‌ను ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్ 'ఈ-బే'లో విక్రయానికి ఉంచాడు. దీని ద్వారా వచ్చిన నిధులను 'బిగ్ బ్రదర్స్, బిగ్ సిస్టర్స్' ఎన్జీవోకు అందజేస్తానని తెలిపాడు. తాజాగా కార్ల్‌సన్ ఆ జీన్ ప్యాంట్‌ను ఒక వ్యక్తి రూ. 31 లక్షలు పెట్టి కొనుగోలు చేశాడని తన ఎక్స్ ఖాతా వేదికగా తెలిపాడు.

దుబాయ్ మాకూ కొత్తే

ఇదేం మా హోంగ్రౌండ్ కాదు

'పిచ్ అడ్వాంటేజ్' విమర్శలకు రోహిత్ కౌంటర్

పాక్‌లో అయితే దంచికొట్టేవాళ్లం: గంగూలీ

దుబాయ్: హైబ్రిడ్ మోడల్‌లో భాగంగా చాంపియన్స్ ట్రోఫీలో తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఒకే వేదికపై ఆడుతున్న భారత జట్టుకు 'పిచ్ అడ్వాంటేజ్' లభిస్తుందని వస్తున్న విమర్శలకు టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ ఘాటుగా కౌంటర్ ఇచ్చాడు. దుబాయ్ తమ సొంత గ్రౌండ్ కాదని, ఇక్కడి పిచ్‌లు తమకూ కొత్త సవాళ్లను విసురుతున్నాయని తెలిపాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు నాసిర్ హుస్సేన్, అథర్టన్‌తో పాటు ఆసీస్ సారథి పాట్ కమిన్స్.. భారత్ అన్ని మ్యాచ్‌లను ఒకే వేదికపై ఆడటం వారికి భారీ ప్రయోజనాన్ని చేకూర్చుతుందని వ్యాఖ్యానించిన విషయం విదితమే. న్యూజిలాండ్‌తో మ్యాచ్ అనంతరం రోహిత్ మాట్లాడుతూ.. 'మేమిక్కడ మూడు మ్యాచ్‌లు ఆడాం. మూడింట్లోనూ పిచ్ భిన్నంగా స్పందించింది. ప్రతిమ్యాచ్‌లోనూ ఇక్కడ కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇదేం మా సొంత వేదిక కాదు. దుబాయ్ మాక్కూడా కొత్తే. ఇక్కడ నాలుగైదు పిచ్‌లు ఉన్నాయి. న్యూజిలాండ్‌తో మ్యాచ్ సందర్భంగా ఆరంభంలో బంతి కాస్త స్వింగ్ అయింది. మొదటి రెండు మ్యాచ్‌లలో పిచ్ అలా స్పందించలేదు. గత మ్యాచ్‌లలో బంతి మేం ఆశించినంత తిరగలేదు. కానీ కివీస్‌తో మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో బంతి స్పిన్‌కు అనుకూలంగా ఉంది. ఆస్ట్రేలియాతో సెమీస్‌కు ఏ పిచ్‌ను ఉపయోగిస్తారో మాకు తెలియదు. అయితే ఏం జరిగినా అందుకు తగ్గట్టుగా మేం ఆ పరిస్థితులను ఆకలింపు చేసుకోవాలి' అని తెలిపాడు.

'పిచ్ అడ్వాంటేజ్' విమర్శలకు రోహిత్ కౌంటర్

రోహిత్‌తో పాటు మాజీ సారథి సౌరవ్ గంగూలీ కూడా ఈ విమర్శలకు గట్టిగానే బదులిచ్చాడు. దాదా మాట్లాడుతూ 'దుబాయ్ కంటే పాకిస్థాన్ పిచ్‌లు కాస్త మెరుగ్గా ఉంటాయి. ఒకవేళ టీమ్‌ఇండియా గనక అక్కడ ఆడి ఉంటే భారీ స్కోర్లు చేసేది. పిచ్ అడ్వాంటేజ్‌పై కొందరు చేస్తున్న వ్యాఖ్యలన్నీ చెత్తవే. భారత జట్టు గతేడాది టీ20 ప్రపంచకప్ నెగ్గింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్ చేరింది. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో భారత చాలా బలమైన ప్రత్యర్థి. మేం ఎవరినైనా ఓడించగలం' అని వ్యాఖ్యానించాడు.

వలస పక్షులకు నిలయం..

కవ్వాల్ అభయారణ్యం

- కాగజ్‌నగర్-లక్సెట్టిపేట వరకు 132 రకాల విహంగాలు
- రష్యా, ఆఫ్రికా, మంగోలియా, ఆస్ట్రేలియా నుంచి వలస

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, గోదావరి పరీవాహక ప్రాంతం పక్షి వైవిధ్యం, సంరక్షణకు నిలయంగా మారింది. మంచిర్యాల జిల్లాలోని చెరువులు, కుంటల్లో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. రష్యా, మంగోలియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, వియత్నాం నుంచి కవ్వాల్ అభయారణ్యంలోకి 132 జాతుల జాతుల పక్షులు సేదతీరడానికి చేరుకున్నాయి. లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట్ చెరువు పక్షులతో చూడముచ్చటగా కనిపిస్తున్నది. పక్షుల వీక్షణం, అధ్యయనం కోసం అటవీశాఖ అధికారులు బర్డ్ ఫెస్టివల్ నిర్వహించారు. రెండురోజుల పాటు జరిగిన కార్యక్రమానికి పక్షి ప్రేమికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. విద్యార్థులు అరుదుగా కనిపించే పక్షులను ఆసక్తిగా తిలకించారు. పక్షుల ప్రాముఖ్యత ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఫర్ ఫారెస్ట్స్ సువర్ణ కోరారు. పక్షుల పరిరక్షణ అందరి బాధ్యత అని మంచిర్యాల జిల్లా అటవీ అధికారి శివ ఆశీశ్‌సింగ్ చెప్పారు.

'ఇంటర్' సెంటర్‌కు 9:05 వరకు అనుమతి

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు.. అన్ని ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షలకు ఉదయం 8:45 గంటలలోపు వస్తేనే అనుమతిస్తామన్న నిబంధన పెట్టినా.. 9:05 గంటల వరకు వచ్చిన విద్యార్థులను సైతం పరీక్షకు అనుమతించనున్నట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య వెల్లడించారు. ఈ సారి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని కూడా పరీక్షకు అనుమతిస్తామని పేర్కొన్నారు. అయితే ఉదయం 8:45 గంటల వరకు వచ్చిన వారిని మాత్రమే అనుమతిస్తామని హాల్‌టికెట్లపై ముద్రించిన మాట వాస్తవమేనని, విద్యార్థులు త్వరగా పరీక్షాకేంద్రాలకు వస్తే టెన్షన్‌కు గురవకుండా పరీక్షరాస్తారన్న ఆలోచనతో అలా ముద్రించామని తెలిపారు. ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో సోమవారం నాంపల్లిలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో కృష్ణఆదిత్య ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుడు ఓ విద్యార్థి ఆలస్యంగా పరీక్షకు వచ్చి ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ప్రత్యేక పరిస్థితుల్లో సడలింపు ఇచ్చామని చెప్పారు. ఈ నెల 5 నుంచి 25 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు.

ఇది తొలి అడుగు మాత్రమే.. ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

'ఇంటర్ పరీక్షలు తొలి ప్రయత్నం.. జీవితంలో తొలి అడుగు మాత్రమే. పరీక్షలు బాగా రాయలేదన్న నెపంతో విద్యార్థులెవరూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దు' అని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య సూచించారు. పరీక్షలు బాగా రాయకపోయినా.. ఫెయిలైనా ఇదే ముగింపుగా భావించరాదని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

మూసీ నిర్వాసితులతో కలిసి ఉద్యమిస్తాం

- బాధితులను కలుసుకొంటే పోలీసులు అడ్డుకోవడమేంటి?
- సామాజిక కార్యకర్త మేధాపాట్కర్

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): మూసీ తీరంలో నిర్వాసితులతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని నర్మదా బచావో ఉద్యమకారిణి, హక్కుల నేత మేధాపాట్కర్ హెచ్చరించారు. హైదరాబాద్ వచ్చిన మేధా పాట్కర్ సోమవారం పాత మలక్‌పేట డివిజన్, శంకర్‌నగర్‌లోని మూసీ నిర్వాసితుల కాలనీల్లో ఆమె బాధితులతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం తమ ఇండ్లను కూల్చివేసిందని వారు రోదించారు. ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివసించేవని, మూసీ సుందరీకరణ పేరుతో తమ నివాసాలను కూల్చివేసిన అధికారులు, తమకు ఒకే ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని వాపోయారు. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విలేకరులతో మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్న వారి ఇండ్లను కూల్చివేయడం విచారకరమని అన్నారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉంటే వారికి ఒకే డబుల్ బెడ్ రూమ్ కేటాయిస్తే వారు ఎలా నివాసముంటారని ప్రశ్నించారు. ప్రజలను ఒప్పించి ఆ తరువాత వారి నివాసాలను స్వాధీనం చేసుకొని తరలించాలి తప్ప బలవంతంగా తరలించడం తగదని అన్నారు. బాధితులను కలుసుకొనేందుకు వెళ్తే పోలీసులు వచ్చి అడ్డగించడం ఏమిటని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు.

'ప్రజావాణి-చెన్నమనేని' పుస్తకాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు అందజేసిన చెన్నమనేని కుటుంబసభ్యులు

స్పీకర్‌కు చెన్నమనేని పుస్తకం అందజేత

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): చెన్నమనేని రాజేశ్వర్‌రావు శతజయంతి సందర్భంగా చెన్నమనేని రాజేశ్వర్‌రావు, లలితాదేవి ఫౌండేషన్ 'శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజావాణి-చెన్నమనేని' పుస్తకాన్ని విడుదల చేసింది. ఆ పుస్తకానికి సంబంధించిన 150 కాపీలను రాజేశ్వర్‌రావు కుటుంబసభ్యులు సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు అందజేశారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గడ్డం వివేక్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

48 కి.మీ. దూరంలో ఇంటర్ పరీక్షా కేంద్రం

హైదరాబాద్, మార్చి3 (నమస్తే తెలంగాణ): అధికారుల నిర్లక్ష్యం ఇంటర్ విద్యార్థులకు శాపంగా మారింది. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పూలే జూనియర్ కాలేజీలో 48 మంది ఫస్టియర్, 66 మంది సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఆ కళాశాల పేరు మహాత్మా జ్యోతిబాపూలే దుబ్బాక అని ఉండటంతో సిద్దిపేట డీఐవో రవీందర్ రెడ్డి సెంటర్‌ను దుబ్బాకలో వేశారు. పరీక్షలకు ఒకే రోజు గడువు ఉండటంతో 48 కిలోమీటర్ల దూరం వెళ్లి పరీక్ష రాసేదెలా అని విద్యార్థులు మదనపడుతున్నారు. కేంద్రాన్ని మార్చాలని కోరుతున్నారు.

కుతుబ్‌షాహీ టూంబ్స్ రక్షణకు

చేపడుతున్న చర్యలేమిటి ● ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ): ప్రపంచ వారసత్వ నిర్మాణంగా గుర్తింపు పొందిన కుతుబ్‌షాహీ టూంబ్స్ పరిరక్షణకు చేపడుతున్న చర్యలేమిటో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అగాఖాన్ ట్రస్టును ఆదేశించింది. టూంబ్స్ పరిరక్షణకు100 కోట్లు వెచ్చించేందుకు అగాఖాన్ ట్రస్టు ముందుకొచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని కాంగ్రెస్ నేత మధుయాష్కీగౌడ్ రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి, సోమవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులకు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.